జీఎస్టీ వసూళ్లు 1.84 లక్షల కోట్లు

గతంతో పోల్చితే ఫిబ్రవరిలో 9.1 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 1: జీఎస్టీ వసూళ్లు మరోసారి భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో రూ.1.84 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.68 లక్షల కోట్లతో పోలిస్తే 9.1 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది. దేశీయ వినిమయం పుంజుకోవడం, ఆర్థిక రంగం తిరిగి వృద్ధి బాట పట్టడం వల్లనే జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదవుతునాయని వెల్లడించింది. గత నెలలో వసూలైన రూ.1.84 లక్షల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.35,204 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,704 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.90,870 కోట్లు, పరిహారం సెస్ రూపంలో రూ.13,868 కోట్లు వచ్చాయని పేర్కొంది. జీఎస్టీ వసూళ్లలో దేశీయంగా వచ్చిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10.2 శాతం ఎగబాకి రూ.1.42 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను ద్వారా రూ.41,702 కోట్లు సమకూరాయి. అలాగే రూ.20,889 కోట్ల పన్నును రిఫండ్ రూపంలో చెల్లించింది. ప్రస్తుత సంవత్సరం తొలి నెల జనవరిలో రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. దీనిపై ఈవై ట్యాక్స్ పార్టనర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శణమని, అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితిలో ఉన్నప్పటికీ పన్ను వసూళ్లు ఇంచుమించు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషమన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లు 10 శాతం నుంచి 20 శాతం వరకు అధికమవగా, అలాగే తెలంగాణతోపాటు గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో 1 శాతం నుంచి 4 శాతం వరకు పెరిగాయి.

టెస్లాపై ఆశలు వదులుకున్నట్టేనా?

తీవ్రంగా పోటీపడుతున్న వివిధ రాష్ట్రాలు
పట్టించుకోని తెలంగాణ సర్కారు
టెస్లా కోసం గతంలో కృషిచేసిన కేటీఆర్

టెస్లా కారుతో కేటీఆర్ (ఫైల్)

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆ పెట్టుబడిని రాబట్టేందుకు పలు రాష్ట్రాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఉచిత భూములు, రకరకాల ప్రోత్సాహకాల ఆశ చూపడంతోపాటు తమ రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను ఎత్తిచూపుతూ ఎలాగైన పరిశ్రమను దక్కించుకొనేందుకు ఎవరి మార్గాల్లో వారు ప్రయత్నిస్తున్నారు. ఈ పోటీలో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. టెస్లా ప్లాంటు కోసం రాష్ట్ర సర్కారు అవసరమైన మేరకు ప్రయత్నాలు చేయకపోవడమే ఈ వాదనలకు బలాన్ని చేకూర్చుతున్నది.

టెస్లా కంపెనీని ఆకర్షించేందుకు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, కర్ణాటక, తెలంగాణ సైతం రేసులో ఉన్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఇప్పటికే అనేక ఆటోమొబైల్ పరిశ్రమలు కొనసాగుతుండటం వాటికి కలిసొచ్చే అంశం. ఇప్పటికే పలు ప్రముఖ కార్ల తయారీ కంపెనీలు ఈ రాష్ట్రాల్లో తమ పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులు చేస్తున్నాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు ఐటీ పరిశ్రమలు అధికంగా ఉండటం కొంత అనుకూలాంశం కాగా, ఈ రెండు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కావడం ప్రతికూలాంశమని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. పోటీలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మినహా అన్నింటికీ ఓడరేవు ఉంది. దీంతో ఎగుమతి, దిగుమతులకు ఈ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయి. అన్నిటికి మించి మన రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో టెస్లాతో సంప్రదింపులు జరిపినప్పటికీ అనంతరం ఆ ప్రయత్నాలను కొనసాగించకుండా వదిలేసిందని అంటున్నారు. ముఖ్యంగా ఓడరేవు లేకపోవడం, ఎన్డీఏ కూటమిలోని రాష్ట్రాలతో మనం పోటీ పడే అవకాశం లేదనే భావన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా, దాదాపు నాలుగేండ్ల క్రితం టెస్లా కార్ల తయారీ కంపెనీ భారత్‌కు వస్తున్నట్టు సంకేతాలు వెలువడిన వెంటనే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ దాన్ని తెలంగాణకు వచ్చే విధంగా తీవ్రంగా కృషిచేశారు. నిరంతరం కంపెనీ వర్గాలతో సంప్రదింపులు జరపడమే కాకుండా ఇతర రాష్ట్రాలను తలదన్నే విధంగా తాము ప్రోత్సాహకాలు ఇస్తామని కంపెనీ వర్గాలకు సమాచారం అందించారు. దీంతో తెలంగాణ గట్టి పోటీదారుగా ఎదగడమే కాకుండా టెస్లా భారత్‌కు వస్తే అది తెలంగాణలో ఏర్పాటు ఖాయమనే ప్రచారం అప్పట్లో జరిగింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో అంచనాలు తారుమారయ్యాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సుంకాలతోపాటు పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన సహకారంపై ఆయన లేవనెత్తిన అంశాలకు ప్రధాని సానుకూలంగా స్పందించడంతో టెస్లా కంపెనీ భారత్ రాకకు మార్గం సుగమమైంది. అంతేకాదు, ఇప్పటికే తమకు అవసరమైన ఉద్యోగుల నియామకం కూడా టెస్లా చేపట్టింది. సుమారు 500మిలియన్ డాలర్లతో మొదటి దశ పెట్టుబడితో ప్లాంటు ఏర్పాటునకు టెస్లా సిద్ధమవుతున్నది.

వాహన అమ్మకాలు అంతంతే

న్యూఢిల్లీ, మార్చి 1: వాహన ఉత్పత్తి సంస్థలకు ఫిబ్రవరి నెల షాకిచ్చింది. ధరలను పెంచుతూ వాహన ఉత్పత్తి సంస్థలు తీసుకున్న నిర్ణయంతో కొనుగోలుదారులు వెనుకంజవేశారు. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ అమ్మకాలు స్వల్పంగా పెరగగా.. హ్యుందాయ్, టాటా మోటర్స్ సేల్స్ భారీగా తగ్గాయి. వాహనాలకు డిమాండ్ పడిపోవడం వల్లనే తగ్గాయని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. మరోవైపు, మహీంద్రా, టయోటా కిర్లోస్కర్‌లు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో పన్ను సంస్కరణలు, లిక్విడిటీని పెంచడానికి తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో డిమాండ్‌ను పెంచుతాయన్న విశ్వాసాన్ని హ్యుందాయ్ మోటర్ సీఈవో తరుణ్ గార్గ్ వ్యక్తంచేశారు.

ఫిబ్రవరిలో వాహన విక్రయాలు

సంస్థ	2025	2024	వృద్ధి
మారుతి	1,99,400	1,97,471	స్వల్పంగా
హ్యుందాయ్	58,727	60,501	–3
మహీంద్రా	83,702	72,923	15
టయోటా	28,414	25,220	13
టాటా మోటర్స్	79,344	86,406	–8
కియా ఇండియా	25,026	20,200	24
హోండా కార్స్	10,323	13,078	–21



ఎన్టీపీసీ దూకుడు

న్యూఢిల్లీ: విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 400 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. కేవలం ఈ మైలురాయికి చేరుకోవడానికి సంస్థ 335 రోజులు పట్టింది. అంతక్రితం ఏడాది కంటే 12 రోజులు ముందుగానే ఈ మైలురాయికి చేరుకోవడం విశేషం. 2023–24లో మార్చి 13న ఈ కీలక మైలురాయికి చేరుకున్నది. దేశీయంగా వినియోగిస్తున్న విద్యుత్‌లో నాలుగోవంతు సంస్థ ఉత్పత్తి చేస్తున్నదే కావడం విశేషం. ప్రస్తుతం సంస్థ 77 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగివుండగా, మరో 29.5 గిగావాట్ల విద్యుత్ యూనిట్లు నిర్మాణదశలో ఉన్నాయి.



ఎన్ఎండీసీ ఉత్పత్తి హైజంప్

హైదరాబాద్, మార్చి 1: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఎన్ఎండీసీ ఆశాజనక పనితీరు కనబరిచింది. ఫిబ్రవరి నెలలో సంస్థ 4.62 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 3.98 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన ఖనిజంతో పోలిస్తే 18 శాతం వృద్ధిని కనబరిచినట్లు కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఖనిజాన్ని ఉత్పత్తి చేయడం కూడా కంపెనీ చరిత్రలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సంస్థ 40.49 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 40.20 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. వచ్చే ఏడాది నూతన గనులు అందుబాటులోకి వస్తుండటంతో ఖనిజ ఉత్పత్తి మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు.

ఎంఎస్ఎంఈల మనుగడ ప్రశ్నార్థకం

- మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మారాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఎంఎస్ఎంఈలు, ఎస్ఎంఈలు మారాలని, లేదంటే రాబోయే రోజుల్లో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధ(ఏఐ) యుగంలోనూ పాత ఆలోచనలతో సంప్రదాయబద్ధంగా ముందుకెళ్తే తప్పా మనగడే ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని, ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు ఈ విషయంలో అప్రమత్తంగా, ప్రజలు కోరుకుంటున్న విధంగా కొత్తగా ఆలోచించాలని ఆయన సూచించారు. ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన 'సమ్మిట్ ఆన్ ఫ్యూచర్–రెడీ ఇండస్ట్రీ ట్రాన్సఫర్మేషన్: ఇన్నోవేటింగ్ ఫర్ గ్రోథ్ ఎఫిషియన్సీ అండ్ సెక్యూరిటీ(గ్రోథ్ ఎక్స్2025)' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..టెక్నాలజీ రోజురోజుకి కొత్త పుంతలు తొక్కుతున్నదని, ముఖ్యంగా ఏఐ అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి..అలాగే అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచన తీరు మారాలని ఆయన పేర్కొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు ఏఐ, క్వాంటమ్, మెషిన్ లెర్నింగ్ తదితర అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను చూపొంచవచ్చని, ఆ దిశగా ఆవిష్కర్తలు కొత్తగా ఆలోచించాలని కోరారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో ఇతర రాష్ట్రాలకు దీటుగా తెలంగాణ అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నదని, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధి రేటు 17.98 శాతం కాగా జాతీయ సగటు 8 శాతం మాత్రమేనని, ఐటీ రంగంలో తెలంగాణ సత్తా ఏంటో చెప్పడానికి ఇదే నిదర్శనమని మంత్రి అన్నారు.

6 నుంచి చర్లపల్లిలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో

ఈ నెల 6 నుంచి 8 వరకు చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో–2025 ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో 106 స్టాల్స్‌ను నెలకొల్పుతున్నట్లు, వాటిలో వివిధ పరిశ్రమలు తయారు చేస్తున్న ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించనున్నట్లు వారు చెప్పారు.

అల్ట్రాటెక్‌లో కేశోరాం విలీనం

పాలకుర్తి, మార్చి 1: ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌లో బీకే బిర్లా గ్రూపునకు చెందిన కేశోరాం సిమెంట్ విలీనమయ్యాయి. ఇందుకు సంబంధించి పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వద్ద ఉన్న యూనిట్‌లో ఇందుకు సంబంధించి అధికారిక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 ఏండ్ల క్రితం ఉత్తర తెలంగాణలోని బసంత్ నగర్‌లో బీకే బిర్లా సిమెంట్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఆతర్వాతి క్రమంలో ఇక్కడే కేశోరాం సిమెంట్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం ఈ కేశోరాం సిమెంట్‌ను ఆదిత్యా బిర్లా గ్రూపు కొనుగోలు చేయడంతో ఇక నుంచి ఈ ప్లాంట్‌లో అల్ట్రాటెక్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శనివారం ఈ యూనిట్‌లో కార్మికులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేసి, అధికారికంగా అల్ట్రాటెక్ లోగోను ఆవిష్కరించారు.

సదానందాన్ని వేధించినవారిపై చర్యలు తీసుకోవాలి

ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న హరిప్రియ, దిండిగాల

ఇల్లెందు, మార్చి 1: ఇల్లెందు మార్కెట్ యార్డ్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పలువురు అధికారులు వేధింపులు తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి చేసిన సదానందాన్ని వేధించినవారిపై చర్యలు తీసుకోవాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ డిమాండ్ చేశారు. కొత్తగూడెం ప్రభుత్వ హస్పటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్‌తో కలిసి సదానందాన్ని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగిపై మార్కెట్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తోటి ఉద్యోగులు వేధింపులకు గురి చేసి ఆయన ఆత్మహత్యాహత్నం చేసుకునేలా చేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పరుచూరి వెంకటేశ్వర్లు, దాస్యం ప్రమోద్‌కుమార్, గిన్నారపు రాజేష్, బానోత్ నాగేందర్ తదితరులు ఉన్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం


నరసింహారావు, ఇంటర్ పరీక్షా కేంద్రాల కస్టోడియన్

అశ్వారావుపేట, మార్చి 1: ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షా కేంద్రాల కస్టోడియన్ డి.నరసింహారావు తెలిపారు. నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అశ్వారావుపేటలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 9,485 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు అర గంట ముందుగా చేరుకోవాలని, ఎటువంటి వత్తిడికి గురికాకుండా పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు.

రహ'దారి'ప్రయాణం నరకప్రాయమే..

పట్టించుకోని అధికారులు


బూర్గంపహాడ్–సారపాక మధ్యలో గుంతలు ఏర్పడిన రహదారి

బూర్గంపహాడ్, మార్చి 1: బూర్గంపహాడ్–సారపాక ప్రధాన రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. బూర్గంపహాడ్ నుంచి సారపాక వెళ్లే రహదారి పొడవునా అక్కడక్కడా పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. భద్రాచలం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, పర్యాటకులతోపాటు వాహనదారులు నిత్యం వేలాదిగా ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుండడంతో రహదారి నిత్యం రద్దీగా మారుతోంది. బూర్గంపహాడ్ నుంచి మొదలుకుని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, సారపాక పరిసరాల వరకు ప్రయాణం సాగించాలంటే భయపడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రహదారిలో ఇటీవల ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలూ ఉన్నాయి. గతంలో అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించినప్పటికీ మళ్లీ అదే పరిస్థితి నెలకొన్నదని, గుంతలు పూడ్చకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై 'నమస్తే' ఆర్ అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 1 : పదో తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగే పరీక్షల కోసం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 73 పరీక్షా కేంద్రాల్లో 12,282 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. 73 చీఫ్ సూపరింటెండెంట్లు, 5 ఫ్లైయింగ్ స్కాడ్‌లు, 7 రూట్ ఆఫీసర్లు, 73 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 5 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 73 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు రవాణా, పరీక్ష అనంతరం సమాధాన పత్రాల బండిల్స్‌ను పోస్టాఫీస్‌కు తరలింపు భద్రంగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, 144వ సెక్షన్‌ను అమలు చేయాలని సూచించారు. సమావేశంలో డీఈవో వెంకటేశ్వరచారి, డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, విద్యుత్‌శాఖ అధికారి మహేందర్, పోలీస్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఘటన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 1 : మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్ర నాయకులు సమావేశమవుతున్నట్లుగా పోలీసు ఉన్నతాధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో కోబ్రా, డీఆర్‌జీ, జిల్లా పోలీసు బలగాల సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 500 మంది సాయుధ బలగాలు ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. మావోయిస్టులు సమావేశం నిర్వహిస్తున్న ప్రాంతాన్ని భద్రతా దళాలు నలుదిక్కుల నుంచి చుట్టుముట్టారు. దీనిని గమనించిన మావోయిస్టులు జవాన్లపైకి కాల్పులు జరపడంతో వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య సుమారు మూడు నాలుగు మార్లు విడతల వారీగా కాల్పులు జరిగాయి. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు దట్టమైన అటవీ మార్గంలోకి కాల్పులు జరుపుతూనే పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం నుంచి ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఓ మహిళా మావోయిస్టు ఉంది. ఈ ఘటనతో అప్రమత్తమైన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులు సరిహద్దు ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పూర్తి వివరాలను అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

ప్రతి గ్రామానికి తాగునీటి సరఫరా జరగాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు

దుమ్ముగూడెం, మార్చి 1: ప్రజల దాహార్తిని తీర్చేందుకు మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి తాగునీటి సరఫరా జరగాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు డిమాండ్ చేశారు. లక్ష్మీనగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కో–కన్వీనర్ ఎండీ.జానీపాషాతో కలిసి ఆయన మాట్లాడారు. వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించాలని మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టి ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఏ గ్రామంలో చూసినా మంచినీటి సమస్య తలెత్తుతుందని, ఎండాకాలం రాకముందే ఇలా ఉంటే ముందు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మండలంలో 80 శాతం గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా మంచి నీరు అందుతుందని, వేసవిలో ప్రజలకు మంచినీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు వాగే వెంకటేశ్వరరావు, దామెర్ల శ్రీనివాసరావు, తూరుబాక మాజీ సర్పంచ్ భూక్యా చందు, కుమ్మరికుంట సూర్య, తంతరపల్లి వెంకటేశ్వరరావు, బిలపాటి లక్ష్మణ్‌రావు, బాణోత్ నగేష్ పాల్గొన్నారు.

వైద్యుల కొరత.. ఆపై కోత..!

- జిల్లాలో 8 మంది కాంట్రాక్ట్ వైద్యుల తొలగింపు
- ఏజెన్సీలో వైద్య సేవలకు మరిన్ని ఇబ్బందులు


PROCEEDINGS OF THE SUPERINTENDENT :: DISTRICT HEAD QUARTERS HOSPITALS :: BHADRADRI KOTHAGUDEM DISTRICT

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వైద్యులను తొలగిస్తూ ఉత్తర్వులు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : ఏజెన్సీ ప్రాంతంలో వైద్యుల కొరతతో సతమతమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రభుత్వం మరో పిడుగు వేసింది. ఆసుపత్రులలో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోగా.. ఎలాగోలా కాంట్రాక్టు వైద్యులతో నెట్టుకొస్తున్నా వారిని ఇప్పటికిప్పుడు తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ఆందోళన కలిగిస్తున్నది. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో ఉండి ఉద్యోగం చేయాలంటే పట్టణాల్లో పనిచేసే వైద్యులు రారనే విషయం అందరికీ తెలిసిందే. దీంతో ఏజెన్సీ ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రిటైర్డ్ వైద్యులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించి వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో రిటైర్డ్ వైద్యులు పనిచేస్తే ప్రభుత్వ నిబంధనలు, మందుల కొరత తదితర వ్యవహారాలు బయటకు లీక్ చేస్తున్నారనే ఉద్దేశంతో వారిని తొలగించాలని నిర్ణయించారు. జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం ప్రాంతాల్లోని ఏరియా ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న 8 మంది వైద్యులను తొలగించారు. తొలగింపునకు గురైన వైద్యులు ఇదేమిటని ప్రశ్నిస్తే.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పడం గమనార్హం.

వైద్యుల కొరతతో సతమతం

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో వైద్యులు అరకొరగా ఉండగా.. ఇప్పుడు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే వారిని ప్రభుత్వం తొలగించడంతో కొరత మరింతగా పెరుగనున్నది. ఇప్పటికే ఇల్లెందులో కొత్త పోస్టులు ఏమీ లేకపోవడంతో ఇద్దరు కాంట్రాక్ట్ వైద్యులను నియమించారు. అక్కడ ఉన్న ఇద్దరు వైద్యులను తొలగించడంతో ఆసుపత్రిలో సమస్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. భద్రాచలం ఆసుపత్రిలో పిల్లల వైద్యులు ముగ్గురు ఉన్నా సరిపోని పరిస్థితి. కానీ.. అక్కడ ఉన్న ముగ్గురు వైద్యులలో ఒకరిని తొలగించారు. అదే తరహాలో పాల్వంచ, మణుగూరు ఆసుపత్రుల్లో కూడా వైద్యులను తొలగించారు. దీంతో వైద్యుల కొరత మరింత పెరుగనుండగా.. వైద్య సేవలు అందకపోవడంతో ఏజెన్సీ ప్రాంత రోగులు సతమతమయ్యే పరిస్థితి ఉంది.

సీఎంఆర్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు


బియ్యం లారీ రికార్డులను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

అశ్వారావుపేట, మార్చి 1: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ హెచ్చరించారు. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యం సీఎంఆర్ పద్ధతిలో రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, నిర్దేశించిన బియ్యం ప్రభుత్వానికి ఇవ్వకుండా మిల్లర్లు బయట మార్కెట్‌లో విక్రయిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం రాత్రి నుంచి నిఘా వేసిన టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం వరకు 12 బియ్యం లారీలను తనిఖీ చేశారు. నల్లొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాకినాడ పోర్ట్‌కు వెళుతున్న బియ్యం లారీలను చెక్‌పోస్ట్ వద్ద ఆపి సోదాలు నిర్వహించారు. అనుమతి పత్రాలను తనిఖీ చేసి నిర్ధారణ కోసం ఆయా జిల్లాల సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. లారీలు బయలుదేరిన మిల్లుల్లో అక్కడ అధికారులు సోదాలు నిర్వహించి 10 లారీల అనుమతులు సక్రమంగా ఉన్నాయని చెప్పటంతో వాటిని విడుదల చేశారు. నల్గొండ జిల్లాకు చెందిన మరో రెండు లారీల వివరాల కోసం టాస్క్‌ఫోర్స్ అధికారులు వేచి చూస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం మిల్లర్లకు ఇచ్చిన ధాన్యానికి బదులు సూచించిన బియ్యం ఖచ్చితంగా తిరిగి అందించాలన్నారు. సీఎంఆర్ బియ్యం తరలింపుపై సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. బృందంలో సీఐ వసంతరావు, ఎస్సైలు కృష్ణ, జంగయ్య, భాస్కర్, సిబ్బంది ఉన్నారు.